# తీతువు - సముద్రం - గరుత్మంతుడు

అనగనగా ఒక పెద్ద సముద్రం ఉండేది. ఆ సముద్రపు ఒడ్డున ఒక తీతువు జంట గూడు కట్టుకుని నివసిస్తూ ఉండేవి. కొన్ని రోజులకి ఆడ తీతువు గర్భం దాల్చి గుడ్లు పెట్టింది. తీతువు జంట ఆనందంలో ఉండగా, సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున లేచాయి. అది చూసి ప్రాణభయంతో తీతువులు గాలిలోకి ఎగిరి ప్రాణాలు కాపాడుకున్నాయి, కాని వాటి చిన్న గూడు అందులోని గుడ్లు ఆ అలల్లో కొట్టుకుని పోయినాయి. అది చూసి ఆ దంపతులు చాలా బాధ పడ్డాయి.

కొన్నాళ్ళకి వాటి దుఃఖం తగ్గింది. మళ్ళీ కొత్త గూడు కట్టుకున్నాయి. ఆడతీతువు మళ్ళీ గర్భవతి అయ్యింది. గుడ్లు పెట్టింది. ఇది చూసిన సముద్రుడు చెట్టంత ఎత్తున పొంగాడు. గూడు గుడ్లు మళ్ళీ కొట్టుకుని పోయినాయి.

అప్పుడు కోపంతో మగతీతువు " ఓ సముద్రుడా ! మేము చిన్న వాళ్ల మని మా మీద ఊరికనే విరుచుకుని పడటం నీకు భావ్యం కాదు. పిల్లలు ఎవరికి అయినా పిల్లలే. ఈ సంగతి నీకు తెలియదా..ఈ సారి మటుకు పొంగవద్దు" అని సముద్రుడితో అన్నది. అది విని సముద్రుడు పక పకా నవ్వి "నీ మాట నేను లక్ష్య పెట్టనవసరం లేదు" అని చక్కా పోయాడు.

మగతీతువు తన కన్నా బలవంతుడయిన సముద్రుడిని ఏమి చెయ్యలేక ఆలొచిస్తూ కూర్చుని ఉంటే, ఆడతీతువు " మనము చిన్న వాళ్ళము. మనము ఎన్ని మాటలు చెప్పినా సముద్రుడు మన మాట వినడు. కాని మనము ఇలాగే ఊరుకుంటే , మనకి జీవితాంతం పిల్లలు ఉండరు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అందుకని మన పక్షి జాతిలో అత్యంత బలవంతుడయిన ఆ గరుత్మంతుడిని సహాయం అడుగుదాము. అప్పుడు కాని ఈ సముద్రుడు శాంతించడు" అని చెప్పింది

ఇంత మంచి ఉపాయం చెప్పినందుకు భార్యని మెచ్చుకుని విష్ణు మూర్తి వాహనముయి ముల్లోకాలను మూడు నిముషాలలో చుట్టి రాగల మహా పరాక్రమవంతుడు అయిన గరుత్మంతుడిని ఇద్దరూ కలిసి ప్రార్ధించారు.

వెంటనే దయాశీలి అయిన గరుత్మంతుడు ప్రత్యక్షమై " మీకు ఏమి సహాయం కావలనో అడగండి" అన్నాడు. అప్పుడు తీతువులు తమ మీద సముద్రుడు చూపిస్తున్న కోపాన్ని అంతా పిడమరచి చెప్పేటప్పటికి గరుత్మంతుడు సముద్రుడిపై కోపగించాడు. కోపగించి "సముద్రా !" అని ఒక్క కేక వేశాడు.

ఆ కేకకి అదిరిపడిన సముద్రుడు గరుత్మంతుడి వద్దకి భయపడుతూ వచ్చాడు. అప్పుడు గరుత్మంతుడు "సముద్రా.. నువ్వు తీసుకెళ్ళిన ఈ తీతువుల గుడ్లు తెచ్చి ఇవ్వు, ఇక ఎప్పుడూ వీరి జోలికి రావద్దు. ఇది నా ఆజ్ఞ" అని చెప్పాడు.

ఆయన ఆజ్ఞ ప్రకారం సముద్రుడు తీతువు గుడ్లని తీసుకుని వచ్చి ఇక ఎన్నడూ తీతువుల జోలికి రాను అని ప్రతిజ్ఞ చేశాడు.

అప్పుడు గరుత్మంతుడు ఆ తీతువు కుటుంబాన్ని ఆశీర్వదించి మాయమయ్యాడు. అప్పటి నుంచి సముద్రుడి భయం లేకుండా, తీతువులు సంతోషంగా ఉండసాగాయి



PDF created with pdfFactory trial version www.pdffactory.com

చూసారా పిల్లలూ ఈ కథలోని నీతి

బలవంతుడితో చెలిమి కష్టాలని తొలగిస్తుంది.
దుష్టుల వలన కలిగే బాధలని నివారిస్తుంది.

Keywords: Telugu Sahityam, Telugu lo chinna pillala kathalu, bala sahityam, tItuvu samudram garutmantuDi katha, garutmanta tItuvu samudruDu, neeti kathalu, telugu lo bala saahityam

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com